సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 12 । జనవరి । 2024



తీరనున్న రోడ్డుకష్టాలు

9లో▸

గుడిహత్నూర్ మండలంలో సర్వీసు రోడ్లతో పాటు అవసరమైన చోట అండర్ మ్యాన్ పాస్, అండర్ వెహికల్ పాస్‌లు నిర్మించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

ఆదిలాబాద్: సంక్రాంతిని పురస్కరించుకుని రీజియన్ వ్యాప్తంగా 328 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంజీబీఎస్, జేబీఎస్ బస్‌స్టేషన్ల నుంచి బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.నిర్మల్ 110, ఆదిలాబాద్ 68, మంచిర్యాల 94, ఆసిఫాబాద్ 48, ఉట్నూర్ డిపోల పరిధిలో 8 స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
31.0/18.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. చలిప్రభావం తక్కువగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి టి.ప్రణీత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలక్‌మందిర్ ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిలబస్ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్నాయని, విద్యార్థులు కష్టపడి చదివి మంచి గ్రేడింగ్ సాధించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలన్నారు. ఆమె వెంట సెక్టోరల్ అధికారి సుజాత్ ఖాన్, తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

ఇంద్రవెల్లి: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అందునాయక్ తాండ, భీంనగర్‌లో పారిశుధ్యం పరిశీలించారు. డంపింగ్ యార్డు, షో పిట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో సందర్శించి పారిశుధ్యం లోపించకుండా చూడాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సంతోష్‌కుమార్, ఈవో సంజీవ్‌రావు, మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్‌రావ్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పీవీటీజీ నిధులు సద్వినియోగం చేసుకోవాలి




విద్యార్థులతో బోర్డుపై రాయిస్తున్న కలెక్టర్

తాంసి: ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా పీవీటీజీ గ్రామాలకు అందిస్తున్న నిధులను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ కోరారు. గురువారం భీంపూర్ మండలంలోని జల్‌కోరి గ్రామాన్ని సందర్శించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన తీరును పరిశీలించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామానికి రోడ్డు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ హరిదాస్, సర్పంచ్ అనిల్, వైద్యాధికారి నిఖిల్‌రాజ్, కార్యదర్శి జలందర్, ఏఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాయగలగాలి..చదవాలి

తాంసి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాయడంతో పాటు చదవడం నేర్చుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం భీంపూర్ మండలంలోని జల్‌కోరి పాఠశాలలో విద్యార్థులచే బోర్డుపై అంకెలు రాయించడంతో పాటు కూడికలు సైతం చేయించారు.



భోరజ్ సమీకృత రవాణా చెక్‌పోస్టు (ఫైల్)

ప్రైవేట్ సైన్యం

- భోరజ్ రవాణా చెక్‌పోస్టులో అక్రమ వసూళ్ల కోసం..
- గతం నుంచే కొనసాగుతున్నా..
- వివాదంతో మరోసారి తెరపైకి
- ఇటీవలే ఓడీ విధానానికి రద్దు.. ఎక్కడి ఆఫీసర్లు అక్కడికే
- నిత్యం వేలాది వాహనాలు ఈ మార్గంగుండా పయనం



వాహనాలను ఆపుతున్న సిబ్బంది (ఫైల్)

సాక్షి,ఆదిలాబాద్: జైనథ్ మండలం భోరజ్ రవాణా చెక్‌పోస్టు మరోసారి వివాదంలోకి ఎక్కింది. ఈ చెక్‌పోస్టులో అక్రమ వసూళ్ల కోసం నియమించుకున్న ప్రైవేట్ సిబ్బంది ఒకరు డబ్బుల విషయంలో ఓ వాహన డ్రైవర్‌తో బుధవారం రాత్రి గొడవకు దిగడం, తన చేతిలో ఉన్న టార్చ్‌లైట్‌తో దాడికి పాల్పడటం సంచలనం కలిగిస్తోంది. గతం నుంచి ప్రైవేట్ సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని అక్రమ వసూళ్లు చేయడం ఇక్కడ పరిపాటే అయినప్పటికీ వివాదం నేపథ్యంలో మరోసారి ఇక్కడ జరుగుతున్న అక్రమ బాగోతంలో దౌర్జన్యం కూడా కనిపిస్తోంది.

ప్రతీరోజు వేలాది వాహనాలు..


భోరజ్ వద్ద ఆర్టీఏ శాఖతో పాటు ఇతర చెక్‌పోస్టులు కూడా కొనసాగుతున్నాయి. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విస్తరించి ఉన్న జాతీయ రహదారి 44పైన ఉండే ఈ చెక్‌పోస్టు మార్గం గుండా ప్రతీరోజు వేలాది వాహనాలు పయనిస్తుంటాయి. రవాణా శాఖకు సంబంధించి.. వాహనాల పర్మిట్, ఓవర్‌లోడ్, లైసెన్సులు, ట్యాక్స్‌లు, ఇతరత్రా పత్రాలు సరిగ్గా ఉన్నాయా? లేదా అనేది చెక్ చేసి పంపించాలి. 24 గంటల పాటు ఇక్కడికి వచ్చిపోయే వాహనాల తనిఖీతో సందడిగా ఉంటుంది. అక్రమ వసూళ్లు ప్రతీరోజు పెద్ద ఎత్తున సాగుతాయి. రవాణా శాఖకు సంబంధించిన ఈ తనిఖీ కేంద్రంలో ఎంవీఐ, ఏఎంవీఐ, కానిస్టేబుళ్ల పోస్టులతో పాటు రికార్డు అసిస్టెంట్ పోస్టు కూడా ఉంది. కాగా పలు ఆఫీసర్లు, కానిస్టేబుళ్ల పోస్టులు ఖాళీగా ఉండడంతో 24 గంటల పాటు షిఫ్ట్ పద్ధతిలో డ్యూటీల నిర్వహణ ఒత్తిడితో కూడినది. దీంతో ఆర్టీఏ సిబ్బంది ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుని వాహనాల తనిఖీలో ఉపయోగించుకోవడం జరుగుతోంది. ప్రధానంగా వాహనాల నుంచి అక్రమంగా డబ్బులు గుంజడమే వీరి విధిగా సాగుతోంది. వీరి తనిఖీల బారిన పడకుండా ఉండాలంటే వాహనదారులు అక్కడి నుంచి వెళ్లే క్రమంలో ఆమ్యామ్యాలను ఇచ్చుకోవాల్సిందే. ఎవరైనా వాహన డ్రైవర్ ఈ డబ్బుల విషయంలో ఎదురు తిరిగితే ఇలాంటి గొడవలు జరగడం అక్కడ పరిపాటిగా మారింది.

ఇటీవలే ఓడీ తొలగింపు..

ఈ చెక్‌పోస్టులో పలు ఎంవీఐ, ఏఎంవీఐ పోస్టులు ఖాళీగా ఉండడంతో కొన్నేళ్లుగా రాష్ట్రంలోని రవాణా శాఖలో విధులు నిర్వహించే పలువురు ఆఫీసర్లు ఇక్కడ ఆన్‌డ్యూటీ, ఇన్‌చార్జీ బాధ్యతలతో విధులు నిర్వహిస్తూ రావడం జరిగింది. గతేడాది ఫిబ్రవరిలో ఇలా ఆన్‌డ్యూటీపై వచ్చిన ఓ అధికారి మిగితా ఆఫీసర్లతో తనకు ఎక్కువ డ్యూటీలు ఇవ్వాలనే విషయంలో గొడవకు దిగడంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఆదిలాబాద్‌లో జరిగిన ఈ గొడవ కారణంగానే ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఓడీని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సుమారు 21 మంది ఇక్కడ విధులు నిర్వహిస్తుండగా అందులో సగానికి పైగా ఈ ఉత్తర్వుల కారణంగా తాము రెగ్యులర్‌గా విధులు నిర్వహించే చోటుకు వెళ్లారు. ఇక మిగిలిన ఆఫీసర్లకు ఎక్కువ డ్యూటీలు సమకూరే పరిస్థితి నెలకొంది. ఇటీవలే ఇది మొదలు కాగా ప్రైవేట్ వ్యక్తుల వివాదం మరోసారి తెరపైకి రావడం సంచలనం కలిగిస్తోంది.

‘కంది’ పంట పండింది

- బహిరంగ మార్కెట్లో మద్దతు ధరను మించి..
- దిగుబడి వచ్చిన రైతుల్లో కనిపిస్తున్న ఆనందం
- గతేడాది కంటే ఈసారి తగ్గిన సాగు విస్తీర్ణం
- వ్యాపారులతో పోటీపడి వాణిజ్య పంటలు కొనుగోలు చేయనున్న మార్క్‌ఫెడ్



తాంసి మండలం పొన్నారిలో రైతు ఇంటి వద్ద కంది దిగుబడి నిల్వలు

సాక్షి,ఆదిలాబాద్: కందులకు మద్దతు ధర క్వింటాలుకు రూ.7వేలు.. బహిరంగ మార్కెట్లో రూ.9,500 నుంచి రూ.10,500ల మధ్య ధర పలుకుతోంది. ఈసారి కంది దిగుబడి వచ్చిన రైతుకు పంట పండినట్లే.. దీంతో ఇప్పుడిప్పుడే చేతికొస్తున్న, చేతికొచ్చిన పంటను, దిగుబడులను చూసి రైతులు మురిసిపోతున్నారు. అయితే గత వానాకాలం సాగు విస్తీర్ణం కంటే ఈ ఏడాది గణనీయంగా తగ్గింది. దీంతో పలువురు రైతుల్లో ఈసారి అధిక విస్తీర్ణంలో సాగు చేయలేకపోయామే.. అనే నిట్టూర్పు కనబడుతోంది.

మార్క్‌ఫెడ్ వాణిజ్య కొనుగోళ్లు..

దేశ వ్యాప్తంగా నాఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోళ్లు చేపడుతుండగా రాష్ట్రంలో మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించారు. తెలంగాణలో గురువారం నుంచి కందుల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. బహిరంగ మార్కెట్లో అధిక ధర ఉండడంతో మార్క్‌ఫెడ్ కూడా వాణిజ్య కొనుగోలు చేయనుంది. అంటే ప్రైవేట్ వ్యాపారులతో పోటీ పడి అధిక ధరకు ఈ ప్రభుత్వరంగ సంస్థ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. మొత్తంగా ఈ పరిణామం కంది రైతుకు ఊరట కలిగిస్తోంది. ఆదిలాబాద్, జైనథ్, బేల, ఇచ్చోడ, బోథ్, ఇంద్రవెల్లి, తాంసి మార్కెట్ యార్డుల్లో, నార్నూర్, హస్నాపూర్ సబ్ మార్కెట్ యార్డుల పరిధిలోని పీఏసీఎస్‌లలో గతేడాది కొనుగోళ్లు జరిగాయి. ఈసారి పూర్తిగా వాణిజ్య కొనుగోళ్లే ఉండడంతో రైతులు ఇటు వ్యాపారులకు గానీ అటు మార్క్‌ఫెడ్‌కు గానీ విక్రయించే అవకాశాలు ఉన్నాయి.

సాగు విస్తీర్ణం, దిగుబడి..

ఈ వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా 60 వేల 818 ఎకరాల్లో కంది పంట సాగైంది. అధికారులు ఎకరాకు 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. దీని ప్రకారం 3 లక్షల 64వేల క్వింటాళ్ల దిగుబడి రానుంది. గతేడాది వానాకాలంలో జిల్లాలో 65 వేల ఎకరాలకు పైగా పంట సాగైంది. అప్పుడు రూ.6,600 మద్దతు ధర ఉండగా ప్రైవేట్‌లో రూ.7వేల వరకు ధర పలికింది. ఈసారి మాత్రం మద్దతు ధర కంటే అధికంగా బహిరంగ మార్కెట్లో రేటు ఉండడంతో పెద్ద ఎత్తున దిగుబడులు వచ్చిన రైతుల్లో ఆనందం కనిపిస్తోంది.

20 నుంచి కొనుగోళ్లు



ఈ నెల 20 నుంచి కందులు కొనుగోలు చేయనున్నాం. 18న దీనికి సంబంధించిన విధివిధానాలు పూర్తిగా ఖరారు చేయడం జరుగుతుంది. మార్క్‌ఫెడ్ కమర్షియల్ కొనుగోలు చేపడుతుంది. మార్కెట్లో మద్దతు ధరను మించి ప్రస్తుతం రేటు పలుకుతోంది.

– ప్రవీణ్ రెడ్డి, డీఎం, మార్క్‌ఫెడ్, ఆదిలాబాద్

స్వచ్ఛతలో మెరిసిన బల్దియా

- స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో 151వ ర్యాంకు
- ఓడీఎఫ్ డబుల్‌ప్లస్ గుర్తింపు

పట్టణంలోని వార్డులు : 49
జనాభా : 1,17,167
కుటుంబాలు : 48,393
మురికి వార్డులు : 35
ప్రజా మరుగుదొడ్లు : 25
రోజూ ఉత్పత్తి అయ్యే చెత్త : 78 మె.ట.

కైలాస్‌నగర్: స్వచ్ఛతలో ఆదిలాబాద్ బల్దియా మెరిసింది. కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ, స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్–2023 సర్వేలో ఆదిలాబాద్ మున్సిపాలిటీ జాతీయ స్థాయిలో 151వ ర్యాంకు సాధించగా రాష్ట్ర స్థాయిలో 9వ స్థానంలో నిలిచింది. బహిరంగ మల,మూత్ర విసర్జన నిర్మూలన, ఇంటింటికీ చెత్త సేకరణ, వందశాతం వ్యక్తిగత మరుగుదొడ్లు, సులభ్ కాంప్లెక్స్‌ల నిర్వహణ, మురుగునీటి కాల్వలను శుభ్రంగా ఉంచేందుకు ఆదిలాబాద్ మున్సిపాలిటీ యంత్రాంగం చేసిన కృషికి తగిన ఫలితం దక్కింది. పారిశుధ్యం మెరుగుకు చేపట్టిన చర్యలకు గానూ ఓడీఎఫ్ డబుల్ ప్లస్ గుర్తింపును సొంతం చేసుకుంది.

ఓడీఎఫ్ డబుల్ ప్లస్ గుర్తింపు

పారిశుధ్య నిర్వహణ మెరుగు కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన చర్యలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిన కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ, స్వచ్ఛ సర్వేక్షణ్ గురువారం దేశవ్యాప్తంగా ర్యాంకులను ప్రకటించింది. గతేడాది ఆదిలాబాద్ మున్సిపాలిటీ 197వ ర్యాంకును సాధించగా ఈసారి 151 ర్యాంకును సాధించింది. ఇంటింటి చెత్త సేకరణలో 95 శాతం ప్రతిభ కనబర్చగా, నివాస గృహాలు, మార్కెట్ ప్రాంతాలు, తాగునీటి పథకాలు, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణలో వంద శాతం ప్రగతిని సాధించింది. తడి పొడి చెత్త సేకరణలో వెనుబడి ఉంది. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో కేవలం 11 శాతం మాత్రమే ప్రగతి చూపుతుండగా చెత్త వ్యర్థాల పునరుత్పత్తి విభాగంలో 47 శాతం ప్రగతిని కనబర్చినట్లుగా సర్వేలో వెల్లడైంది. ఈ చర్యలకు గానూ ఓడీఎఫ్ డబుల్ ప్లస్ గుర్తింపును కైవసం చేసుకుంది. దానికి సంబంధించిన ధృవీకరణ పత్రం అందుకోనుంది.

446 మున్సిపాలిటీలతో పోటీ

లక్ష జనాభా కలిగిన విభాగంలో దేశవ్యాప్తంగా 446 మున్సిపాలిటీలు పురస్కారం కోసం పోటీ పడ్డాయి. పారిశుధ్య నిర్వహణ, మెరుగు కోసం చేపట్టిన చర్యలకు మొత్తం 9,500 మార్కులు కేటాయించగా ఆదిలాబాద్ మున్సిపాలిటీ 5,029 మార్కులు సాధించి దేశవ్యాప్తంగా 151వ స్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రంలోని లక్ష కేటగిరీ కలిగిన 11 మున్సిపాలిటీలు అందులో ఆదిలాబాద్ బల్దియా తొమ్మిదో స్థానంలో నిలిచింది.

ప్రజల సహకారంతోనే..

ఆదిలాబాద్ మున్సిపాలిటీ మెరుగైన ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది. పారిశుధ్య కార్మికులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వహించడంతోనే ఈ ర్యాంకు సొంతమైంది. ప్రజల సహకారం సైతం ఉపయోగపడింది. ఇదే స్ఫూర్తితో మరింత బాధ్యతగా పనిచేస్తూ భవిష్యత్‌లో మున్సిపాలిటీ స్వచ్ఛ పురస్కారం అందుకునే దిశగా ముందుకు సాగుతాం.

– ఏ.శైలజ, మున్సిపల్ కమిషనర్

భక్తి శ్రద్ధలతో భోగ్‌భండారో

- ఘనంగా గురుకృప దినోత్సవం
- జనసంద్రమైన జాతీయ బంజారా దీక్షభూమి
- హాజరైన జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యేలు



దీక్ష గురువు శ్రీ సంత్ ప్రేంసింగ్ మహారాజ్‌ను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



దీక్షభూమి వద్ద నృత్యం చేస్తున్న జెడ్పీచైర్మన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

నార్నూర్: గురుకృప దినోత్సవాన్ని పురస్కరించుకుని నార్నూర్ మండలం కొత్తపల్లి–హెచ్ గ్రామంలోని జాతీయ బంజారా దీక్ష భూమి వద్ద ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో దీక్ష భూమి జనసంద్రమైంది. గురువారం దీక్ష గురువు శ్రీ సంత్ ప్రేంసింగ్ మహారాజ్ భోగ్‌బండారో మహాపూజ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎంపీలు రవీందర్‌నాయక్, రాథోడ్ రమేశ్, గెడం నగేశ్ పాల్గొని గురువు దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దీక్ష గురువు భక్తులకు హిత బోధనలు చేశారు. సేవాలాల్ మహారాజ్, శ్రీ తపస్వీ రామారావు మహారాజ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

రూ.100 కోట్లు కేటాయించాలి

మహారాష్ట్రలోని పొరదేవి తర్వాత దేశంలోనే బంజారాల రెండో పుణ్యక్షేత్రమైన జాతీయ బంజారా దీక్ష భూమి అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించాలని జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ కోరారు. లంబాడీ గిరిజనుల ఆరాధ్యుడు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీక్ష గురువు ప్రేంసింగ్ మహారాజ్ చూపిన సన్మార్గంలో నడవాలన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలి

తరతరాల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిఒక్కరూ కాపాడాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. నేటి తరం యువతీ యువకులు సంస్కృతి, సంప్రదాయాలు మరిచిపోతున్నారన్నారు. వరకట్నం ఇవ్వడం, తీసుకోవడం కూడా నేరమేనని అన్నారు. వరకట్నం నిషేధించేలా సమాజం పెద్దలు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పరంగా దీక్ష భూమి అభివృద్ధికోసం తన వంతు కృషి చేస్తానన్నారు. దీక్ష గురువు ప్రేంసింగ్ మహారాజ్ చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని సూచించారు.

ఐక్యతతోనే ఏదైనా సాధ్యం

సమాజంలో ఐక్యతగా ముందుకు సాగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలన్నారు. కొత్తపల్లి–హెచ్ గ్రామంలోని జాతీయ బంజారాదీక్ష భూమి తెలంగాణలోనే లంబాడీ గిరిజనుల ఆరాధ్య పుణ్యక్షేత్రమన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్ర త్యేక సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

బంజారాల ఐక్యతే శ్రీరామ రక్ష

బంజారాల ఐక్యతే శ్రీరామరక్ష అని వరంగల్ మాజీ ఎంపీ రవీందర్‌నాయక్ అన్నారు. లంబాడీల రిజర్వేషన్ కోసం పోరాటం చేసిన వారిలో నేనుండడం గర్వంగా ఉందన్నారు. దేశంలోని బంజారాలు ఒకే గొడుకు కిందకు రావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో రిజర్వేషన్ లేక బంజారాలు దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారన్నారు. త్వరలో అన్ని రాష్ట్రాల బంజారాలతో ఐక్యత సమావేశం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్, గ్రామ నాయక్ ఠాక్రునాయక్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్, ఎంపీటీసీ రేణుక దిలీప్ జాదవ్, సర్పంచ్‌లు సుభద్రబాయి రాథోడ్, విష్ణు రాథోడ్, మధుకర్ రాథోడ్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు యూనుస్ అక్బానీ, పల్లకి శోభాయాత్ర అధ్యక్షుడు రమేశ్ రాథోడ్, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్ పాల్గొన్నారు.

సమరయోధుల స్ఫూర్తిని చాటిచెప్పాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



వడ్డె ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డే ఓబన్న పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు చాటి చెప్పాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. వడ్డె ఓబన్న 217 జయంతి వేడుకలను బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో వడ్డె ఓబన్న పోరాటం వీరోచితమని, మహనీయుని చరిత్ర నేటి యువతకు ఆదర్శ ప్రాయమన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ సమాజ హితం కోసం పోరాడిన ఓబన్న పోరాటం మరువలేనిదన్నారు. ఒడ్డెర కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. పట్టణంలో వడ్డెర సంఘ భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా బీసీ సంక్షేమాధికారి కే.రాజలింగు, మైనార్టీ సంక్షేమాధికారి రాథోడ్ రమేశ్, బీజేపీ అధికార ప్రతినిధి లోక ప్రవీణ్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సెలవులు ఇవ్వడంతో ఇంటి బాట పట్టిన విద్యార్థులు



ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

సంక్రాంతి సంబురం

సంక్రాంతి నేపథ్యంలో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో వసతిగృహాల్లోని విద్యార్థులు ఇంటిబాట పట్టారు. గురువారం వారి తల్లిదండ్రులు, బంధువులు జిల్లా కేంద్రానికి చేరుకొని తమ పిల్లలను తీసుకెళ్లారు. దీంతో బస్టాండ్ ప్రాంతం కిటకిటలాడింది. బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థులు సంక్రాంతి సెలవుల్లో సరదాగా గడపనున్నారు. గాలిపటాలు ఎగురవేసి ఆనందంలో మునిగితేలనున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

హిమాలయ పర్వత శిఖరాన్ని అధిరోహించిన విద్యార్థులు



హిమాలయ పర్వతంపై ముధోల్ నియోజక వర్గ విద్యార్థులు

ముధోల్: ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిమాలయ పర్వత అధిరోహణ కార్యక్రమంలో భాగంగా ముధోల్ నియోజకవర్గానికి చెందిన నలుగురు విద్యార్థులు పాల్గొన్నారు. బోరిగాం గ్రామానికి చెందిన ఎర్రం సురేష్, భైంసాకు చెందిన లింగురమొల్లు సంతోష్, భోసి గ్రామానికి చెందిన ఉమ్మెడ వినోద్, మహాలింగి గ్రామానికి చెందిన దీపికలు సముద్రమట్టానికి 2875మీ ఎత్తులో ఉన్న హిమాలయ పర్వతాన్ని అధిరోహించారు. దీంతో తెలంగాణ విశ్వవిద్యాలయ అధికారులు, ప్రముఖులు వారిని ప్రశంశించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో అత్యంత ప్రతిభ కనపరిచి బహుమతులు సాధించారు. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల సంస్థ ఆధ్వర్యంలో భద్రచలంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఇచ్చోడ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన బైపీసీ ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి సిద్ధార్థ స్పాంట్ డ్రాయింగ్ సీనియర్‌లో మొదటి బహుమతి సాధించాగా, సబ్ జూనియర్‌లో 7వ తరగతి విద్యార్థి మనోజ్ మొదటి బహుమతి, విక్రమ్ రెండవ బహుమతి సాధించాడు. 7వ తరగతి విద్యార్థి వంశీ బెస్ట్ ఆఫ్ వెస్ట్‌లో మొదటి బహుమతి, షార్ట్ ఫిల్మ్ మేకింగ్‌లో మొదటి బహుమతి సాధించాడు. గురువారం ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాళ్లు హరిరాం, నర్మద అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుల ఎంపిక కోసం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ సామాజిక కార్యకర్తల నుంచి, స్వచ్ఛంద సంస్థల సభ్యుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖాధికారిని సునిత కుమారి తెలిపారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా అమలు చేస్తున్న పీసీఆర్ చట్టం 1955, ఎస్సీ, ఎస్టీ, పీవోఏ 1989 చట్టం ద్వారా అట్రాసిటీ కేసులలో బాధితులైన వ్యక్తులకు ప్రభుత్వం తరుపు నుంచి ఆర్థికంగా, పునరావాసం కల్పించుటకు విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 25లోగా జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలన్నారు.

రెండు దుకాణాల్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని పంజాబ్‌చౌక్‌లోని అజునుర్ ట్రేడర్స్‌లో, ప్రవీణ్‌సింగ్ ఆటోమొబైల్ షాపుల్లో బుధవారం రాత్రి చోరీకి పాల్పడినట్లు టు టౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం అజునుర్ ట్రేడర్స్‌లో రూ.15వేల నగదు, దాని పక్కనే గల ఆటో మొబైల్ షాపులో రూ.1000 నగదును దొంగలించినట్లు పేర్కొన్నారు. దుండగులు ఆ షాపుల షెటర్ల తాళాలను పగులకొట్టి చోరీకి పాల్పడినట్లుగా తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లుగా పేర్కొన్నారు.

వివేకవాణి..

యువతకు స్ఫూర్తి

- మాటలతో మారిన వారెందరో..
- విషాదం నుంచి విజేతలుగా..
- సమాజసేవలో భాగస్వాములుగా..
- యువతరానికి హీరోగా..
- నేడు స్వామి వివేకానంద జయంతి



నిర్మల్: 'లే.. మేలుకో.. నీలక్ష్యం చేరే వరకు విశ్రమించకు..' అంటూ భుజం తట్టి లేపుతూ.. 'బలమే జీవనం.. బలహీనతే మరణం.. సమస్త శక్తి నీలోనే ఉంది..' అని ధైర్యాన్ని నూరిపోస్తూ.. 'లక్ష్య సాధనలో వంద నరకాలైనా అనుభవించేందుకు సిద్ధంగా ఉండు.. కానీ విజయాన్ని సాధించే దాకా విడిచిపెట్టకు..' అని నిత్యం ప్రేరేపిస్తూ.. 'అపార విశ్వాసం, అనంత శక్తి.. ఇవే నీ విజయ సాధనకు మార్గాలు..' అని మార్గదర్శనం చేస్తూ.. యువతను విజయ శిఖరాలకు చేరుస్తున్న రియల్‌హీరో స్వామివివేకానంద. కేవలం ఆయన చెప్పిన మాటలే ఎంతోమంది యువతకు ప్రేరణపాఠాలుగా నిలిచాయి. తను అన్న ఒక్కో మాట వందలాదిమంది గుండెల్లో ఇప్పటికీ నిలిచిఉన్నాయి. 'జీవితంలో ఓడిపోయాను. ఇక దేన్ని సాధించలేను..' అని అనుకున్న వాళ్లను సైతం ఆయన రాసిన రాతలు విజేతలుగా నిలిపిన సందర్భాలున్నాయి. కేవలం 39ఏళ్ల జీవితంలో భారతజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన శక్తి వివేకానందది. జనవరి 12న ఆయన జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. జిల్లాలోనూ వివేకుడి స్ఫూర్తితో ముందడుగేస్తూ.. సేవలు చేస్తున్న వారెందరో ఉన్నారు.

బడిని కట్టారు..



రవీంద్రనగర్‌లో యువకులు కట్టిన పాఠశాల గది

వారంతా యువకులు. బాగా చదువుకున్నారు. తలో ఉద్యోగ, ఉపాధులను చేసుకుంటున్నారు. కానీ.. సమాజసేవను మాత్రం విస్మరించలేదు. తాము సంపాదిస్తున్న చిన్నపాటి సంపాదనలో నుంచే కనీసం పదిశాతం సమాజసేవకు వెచ్చిస్తున్నారు. వాళ్లే.. నిర్మల్‌కు చెందిన కొంతం హర్షవర్ధన్, ప్రవీణ్, అజర్, రాహుల్, రాకేశ్, పవన్. వీరంతా కలిసి పలు సేవాకార్యక్రమాలను చేపడుతున్నారు.

ప్రచారం లేకుండా..

కనీసం తమకు ప్రచారాన్ని కూడా ఆశించకుండా ఈ యువత చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. సారంగపూర్ మండలం రవీంద్రనగర్ తండాలో ఏడాదిక్రితం వరకు కనీసం బడికి సరైన గది లేదు. విద్యార్థులు కింద మట్టిలోనే కూర్చునేవారు. ఈ పరిస్థితిని గమనించిన ఈ స్నేహితులు వెంటనే ముందుకు వచ్చారు. తలా కొంత జమచేసిన మొత్తంలో నుంచి రూ.లక్షా 30వేలు ఖర్చుచేసి ఓ తరగతిగదిని కట్టారు. అవును.. ఈ గదిని కూడా వారే స్వయంగా పనిచేసి కట్టి ఇవ్వడం విశేషం.



కొత్తగా కట్టిన తరగతిగదిలో విద్యార్థులు

విద్యార్థుల చెంతకు వివేకుడు..



విద్యార్థులకు కాపీలు, పుస్తకాలందిస్తున్న శ్రీనివాస్

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రానికి చెందిన కొటిక శ్రీనివాస్ నిర్మల్ జిల్లా ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ విభాగంలో పనిచేస్తున్నాడు. విద్యార్థి దశ స్వామి వివేకానందుడి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. తనకు వచ్చే చిన్నపాటి వేతనంలో నుంచే ప్రతీ ఏడాది పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున అందిస్తున్నాడు. పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్నాడు. వివిధ కార్యక్రమాలు, పోటీలు పెడుతూ యువతకు వివేకానంద పుస్తకాలు అందిస్తున్నారు.

నరేంద్రుడి మాటలే ప్రేరణ..



చిన్నతనం నుంచే స్వామివివేకానంద చెప్పిన మాటలు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. ఇప్పటికీ ఎప్పటికీ యువత, విద్యార్థులకు నరేంద్రుడి మాటలు ప్రేరణ కలిగిస్తూనే ఉంటాయి. తను చెప్పిన ప్రతీ విషయాన్ని వీలైనంత ఎక్కువ మందికి చేర్చాలన్నదే నా ప్రయత్నం.

–కొటిక శ్రీనివాస్, ఆరోగ్యశ్రీ ఉద్యోగి,నిర్మల్

నవ భారత నిర్మాణం కోసం 'నవ నిర్మాణ్'



అవగాహన కల్పిస్తున్న సభ్యులు (ఫైల్)

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన మిత్రులు 12మంది కలిసి సమాజానికి తమవంతు సహాయంగా ఏదైనా చేయాలని నవనిర్మాణ్ వెల్ఫేర్ సొసైటీని ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ప్రజలను చైతన్య పరచడమే లక్ష్యంగా సొసైటీని స్థాపించారు. ఆదివాసీ గూడాల్లో సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రొజెక్టర్ ద్వారా కార్యక్రమాలను నిర్వహిస్తూనే వారికి ఆర్థికంగా సహాయాన్ని అందిస్తున్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలను చైతన్య పరచడమే లక్ష్యమని అధ్యక్షుడు శుదోద్దిన్ తెలిపారు.

వివేకానందుడే స్ఫూర్తిగా..



నిత్యావసర సరుకులను అందిస్తున్న స్వామి వివేకానంద యూత్ సభ్యులు

వివేకానందుడే స్ఫూర్తిగా మండలంలోని కొత బి గ్రామానికి చెందిన 15 మంది యువకులు స్వామి వివేకానంద పేరుతో యూత్‌ను ఏర్పాటు చేశారు. మండలంలోని గుర్రాలతాండ గ్రామానికి చెందిన ఓ బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులను అందజేశారు. అవసరమగు వారికి రక్తదానం చేస్తున్నారు. పలు రకాల కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. తమ యూత్ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామని అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ పేర్కొన్నారు.

ఉత్సాహంగా రంగోళి పోటీలు





ఆదిలాబాద్‌టౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం రంగోళి పోటీలను నిర్వహించారు. విద్యార్థినిలు వేసిన రంగురంగుల ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అదే విధంగా విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ ప్రాధాన్యతను కళాశాల లెక్చరర్లు విద్యార్థులకు వివరించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ భరద్వాజ్, లెక్చరర్లు రాజ్‌కుమార్, వీరస్వామి, రాజన్న, సురేష్, సునీల్, జ్యోత్స్నరాణి, అహల్య, యశస్వి, సంగీత, హేమలత, లక్ష్మి, అనిత, కృష్ణవేణి, జైపాల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని జైనథ్ మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సిద్దిపేటలో జనవరి 13నుంచి 16వ తేదీ వరకు జరిగే ఫస్ట్ యూత్ నేషనల్ టార్గెట్ బాల్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు 13 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పీఈటీ విజిఎస్ రాకేష్, జ్యోతిస్వరణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం కళాశాల ఆవరణలో క్రీడాకారులతో పాటు పీఈటీలను బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆర్ సీఓ గోపిచంద్ రాథోడ్, ప్రిన్సిపల్ రంగన్న అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ముధోల్ విద్యార్థులు



వికాస్



సరయు

ముధోల్: మండల కేంద్రం ముధోల్‌లోని రబీంద్ర పాఠశాలలో గురువారం నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రా స్థాయికి ఎంపికయ్యారు. ముధోల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని సరయు, జనవరి 11 నుంచి 14 వరకు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. అదే విధంగా లక్ష్మణచాందలో నిర్వహించి అండర్ 14 కబడ్డీ పోటీల్లో వికాస్ అనే విద్యార్థి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు అమీర్‌ఖుస్రు తెలిపారు. వీరిద్దరు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల పలువురు అభినందించారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌కు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీఈటీ

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 16న వరంగల్‌లో నిర్వహించే అండర్ 14 రాష్ట్రస్థాయి కబడ్డీ ఎస్‌జీఎఫ్ స్పోర్ట్స్ మీట్‌కు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపియ్యారు. ఆ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంటె నర్సయ్య, పీఈటీ నాందేవ్‌లు గురువారం అభినందించారు. ఇటీవల జరిగిన జోనల్ స్థాయి కబడ్డీ లీగ్‌లో తమ పాఠశాలకు చెందిన 8, 9వ తరగతి విద్యార్థులు ప్రతిభ కనబర్చి వరంగల్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికై నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు



ప్రజావేదికలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

లక్ష్మణచాంద: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సిబ్బంది విధుల పట్ల ఏ మాత్రం అలసత్వం వహించినా చర్యలు తప్పవని డీఆర్డీవో విజయలక్ష్మి హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీపీ అడ్వాల పద్మ అధ్యక్షతన గ్రామీణ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆమె పాల్గొని మాట్లాడారు. 18 గ్రామ పంచాయతీలలో గత ఏడాది ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు -వాటి ఖర్చుల వివరాలను సామాజిక తనిఖీ సిబ్బంది వివరించారు. పలు గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు సక్రమంగా 7 రకాల రికార్డ్స్ నిర్వహించకపోవడం, హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోయాయని తనిఖీ సిబ్బంది ద్వారా తెలియడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శుల పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. మండలంలోని టీఏలకు రూ.8127 రికవరీ, రూ.1000 జరిమానా వేయగా పంచాయతీ కార్యదర్శులకు రూ.27917 రికవరీ, రూ.27000 జరిమానా, సీవోలకు రూ.2000. జరిమానా, మొత్తం రికవరీ కలిపి రూ.65,917 చెల్లించాలని ఆమె సూచించారు. శుక్రవారం నుండి ప్రతి గ్రామంలో ఉపాధి హామీలో కూలీల సంఖ్యను పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అడ్వాల పద్మ, జెడ్పీటీసీ రాజేశ్వర్, ఎంపీడీవోలు చంద్రశేఖర్, మోహన్, ఏపీవోలు ప్రమీల, దివ్యారెడ్డి ఉన్నారు.

ఆర్టీసీ బస్సులో సీట్ల కోసం కొట్లాట



బస్సులో పెనుగులాడుతున్న మహిళలు

ముధోల్: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో గురువారం సాయంత్రం భైంసా నుంచి మహారాష్ట్రలోని ధర్మాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులో మహిళలు సీట్ల కోసం కొట్లాడుకున్నారు. బస్సులో సీట్లు లేకపోవడంతో తామంటే తాము ముందు ఎక్కామంటూ మహిళలు ఒకరిపై ఒకరు చేయి చేసుకొని పెనుగులాటకు దిగారు. దీంతో బస్సు అరగంటపాటు నిలిచిపోయింది. కండక్టర్, డ్రైవర్ సర్ది చెప్పినా వినకుండా దురుసుగా ప్రవర్తించుకున్నారు. తోటి ప్రయాణికుల చొరవతో గొడవ సద్దుమణిగింది.

ఒకరికి నాలుగేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: బాలికను అవమానించిన వ్యక్తికి నిర్మల్ న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండలంలోని రవీందర్‌నగర్ తండాకు చెందిన రాథోడ్ రాజేష్ ఆటో డ్రైవర్ 2017లో సాయినగర్ తండాలో ఉంటున్న అతడి తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. అదే తండాకు చెందిన ఐదేళ్ల బాలికను తోటలోకి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక తండ్రి సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నేరం రుజువు చేయడంతో రాజేష్‌కు నాలుగేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ.. జిల్లా పోక్స్ కోర్టు ప్రధాన స్పెషల్ న్యాయమూర్తి కర్ణకుమార్ తీర్పునిచ్చారు.

కుమారుడిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ గ్రామానికి చెందిన కుమ్ర సంతోష్ గు రువారం తల్లిదండ్రులపై దాడి చేయడంతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబా ద్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై గోవింద్ తెలిపారు. మద్యం సేవించడానికి తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వకపోవడంతో యాపల్‌గూడ గ్రామానికి చెందిన తల్లి లక్ష్మి, తండ్రి ఊషన్న, నాన్నపై సంతోష్ దాడి చేశారు. ఊషన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'గుబిడిపల్లి'ని సందర్శించిన కలెక్టర్

- గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశం
- మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని సూచన
- రోడ్డు నిర్మాణానికి హామీ



గుబిడిపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



ఆదుకోవాలని కలెక్టర్ కోరుతున్న సంతోష్ భార్య సంగీత

సాక్షి ఎఫెక్ట్

తాంసి: భీంపూర్ మండలంలోని గుబిడిపల్లి గ్రామాన్ని గురువారం కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ నెల 10వ తేదీన 'ఆ ఊళ్లో కిడ్నీలు ఫేయిల్' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ గుబిడిపల్లి గ్రామాన్ని సందర్శించారు. కిడ్నీ వ్యాధికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వ్యాధితో బాధపడుతున్న వారి వివరాలపై ఆరా తీశారు. గ్రామానికి మిషన్ భగీరథ నీటి సరఫరాపై, ప్రస్తుతం గ్రామస్తులు తాగుతున్న నీటి వివరాలు పంచాయతీ కార్యదర్శి అజయ్‌ని అడిగి తెలుసుకున్నారు. నీటి పరీక్షల రిపోర్ట్‌లను పరిశీలించారు. మండల వైద్యాధికారి తో మాట్లాడి కిడ్నీ వ్యాధితో పాటు అనారోగ్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తుల రక్త నమూనాలను సేకరించి జిల్లా కేంద్రంలోని డయాగ్నోస్టిక్ సెంటర్‌లో పరీక్షలు చేయిస్తే కారణాలు తెలిసే అవకాశం ఉందని వైద్యులు సూచించారు. దీంతో వెంటనే వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మిషన్ భగీరథ నీటిని నిత్యం సరఫరా చేయాలని ఎస్ఈ సురేష్‌ను ఆదేశించారు. గ్రామస్తులకు సైతం భగీరథ నీటిని తాగాలని కోరారు. అలాగే గ్రామానికి రోడ్డు సైతం సరిగ్గా లేదని, తీవ్ర అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లగా నిర్మాణానికి చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు. కిడ్నీ వ్యాధితో మృతిచెందిన సంతోష్ భార్య సంగీత కలెక్టర్‌ను కలిసి ప్రభుత్వం తరఫున సాయం అందించి ఆదుకోవా లని కోరింది. వారి వెంట మిషన్ భగీరథ ఎస్ఈ సురేష్, డీఈ రమణ, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ హరిదాస్, మండల వైద్యాధికారి నిఖిల్‌రాజ్, ఏఈ చంద్రశేఖర్, గ్రామసర్పంచ్ రాజు, పంచాయతీ కార్యదర్శి అజయ్, హెచ్ఈవో జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్ ఉన్నారు.

గుడుంబా స్వాధీనం

నిర్మల్‌టౌన్: జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు పట్టణ ట్రాఫిక్ పోలీసులు గురువారం జిల్లా కేంద్రంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. పట్టణ సీఐ పురుషోత్తం వివరాల ప్రకారం... స్థానిక ఈద్గం చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఆటో అనుమానాస్పదంగా కనిపించింది. పోలీసులు దగ్గరికి వెళ్లే సమయంలో పారిపోవడానికి ప్రయత్నించాడు. ఆటోను ట్రాఫిక్ హోమ్ గార్డ్ కబీర్ పట్టుకుని తనిఖీ చేశాడు. దీంతో సుమారు ఐదు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేశారు. విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు. పట్టణ ఎస్సై శంకర్, ట్రాఫిక్ ఎస్ఐలు దేవేందర్, రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

పర్ధాన్ సమాజ్ అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న పూసం ఆనంద్‌రావ్

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అభివృద్ధికి కృషి చేయాలని ఆదివాసీ సమాజ్ అడహక్ కమిటీ జిల్లా నాయకుడు పూసం ఆనంద్ రావ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా, డివిజన్ కమిటీల ఎన్నికల్లో భాగంగా మండల కమిటీ ఎన్నికలు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల కమిటీలను నియమించినట్లు తెలిపారు. అందులో భాగంగానే ఈ నెల 12న మావల మండల కమిటీ ఎన్నిక యథావిధిగా కొనసాగుతుందని వివరించారు. భీంపూర్ మండల ఎన్నిక కమిటీ సమావేశాన్ని అనివార్య కారణాలతో వాయిదా వేయడం జరిగిందన్నారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ విషయాన్ని భీంపూర్ మండల ఆదివాసీ పర్ధాన్ కులస్తులు గమనించి అడహక్ కమిటీ సభ్యులకు సహకరించాలని కోరారు. ఫిబ్రవరి మాసంలో నిర్వహించే హీరా సుక్కా జయంతి సందర్భంగా ఇంద్రవెల్లిలో ఈ నెల 13న సన్నాహక సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. సభ్యులు సెడ్మకి సుభాష్, ఆత్రం అనుసూయ, మడావి దిగంబర్ ఉన్నారు.